క్లుప్తంగా

రైతులను ఆదుకోవాలి

ప్రొద్దుటూరు : తెలంగాణ ప్రభుత్వం తరహాలో మన ప్రభుత్వం కూడా ప్రతి రైతుకు ఎకరాకు రూ.10వేలు సాగు సాయం చేసి ఆదుకోవాలని సీపీఐ పట్టణ కార్యదర్శి పి.సుబ్బరాయుడు గురువారం డిప్యూటీ తహసీల్దార్ మనోహర్‌రెడ్డికి వినతి అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి షరీఫ్, ఏసోబ్ పాల్గొన్నారు.

ఎస్‌ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల ఈవెంట్స్ నిర్వహించాలి

ప్రొద్దుటూరు : ప్రభుత్వం వెంటనే ఎస్‌ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు ఈవెంట్స్ నిర్వహించాలని డీవైఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్ రాజ్ డిమాండ్ చేశారు. స్థానిక డీవైఎఫ్‌ఐ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ ప్రిలిమినరీ పరీక్షలు నిర్వహించి నాలుగు నెలలైనా ఎస్‌ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు ఈవెంట్స్ నిర్వహించకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. డీఎస్సీ, గ్రూప్–2, సచివాలయ పోస్టులకు తక్షణమే నోటిఫికేషన్లు విడుదల చేయాలని తెలిపారు. సమావేశంలో డీవైఎఫ్‌ఐ నాయకులు పవన్, ఉదయ్ పాల్గొన్నారు.

రెండో రోజు అధ్యాపకుల నిరసన దీక్ష

ప్రొద్దుటూరు : జీఓ నంబర్ 110ని అమలు చేయాలని కోరుతూ స్థానిక వైఎస్సార్ ఇంజనీరింగ్ కాలేజీలో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల నిరసన దీక్ష గురువారానికి రెండో రోజుకు చేరుకుంది. జీఓకు విరుద్ధంగా యూనివర్సిటీ అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించడాన్ని వ్యతిరేకిస్తూ వారు దీక్షను ప్రారంభించారు. యూనివర్సిటీ అధికారులతోపాటు కళాశాల ప్రిన్సిపాల్ మీ సర్వీసును ఎలాంటి పరిస్థితుల్లో పరిగణలోకి తీసుకోమని, మీ స్థానంలో గవర్నమెంట్ ఫ్యాకల్టీని తీసుకుంటామని పదే పదే హెచ్చరిస్తూ తమ దీక్షను నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు.

నేడు మడూరులో ఫ్యామిలీ ఫిజీషియన్

చాపాడు : మండలంలోని మడూరు గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారి రాజేష్ కుమార్ తెలిపారు. గ్రామంలోని గ్రామ సచివాలయం వద్ద ఉదయం 9.30గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు గ్రామంలో గ్రామ ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేస్తామన్నారు.

నేడు అల్లాడుపల్లెలో జగనన్న సురక్ష

చాపాడు : మండలంలోని అల్లాడుపల్లె గ్రామంలో శుక్రవారం జగనన్న సురక్ష సభ నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాధాకృష్ణవేణి తెలిపారు. గ్రామ సచివాలయం వద్ద ఉదయం 9.30గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ గ్రామసభ ఉంటుందన్నారు. గ్రామ సభలో అర్హులైన లబ్ధిదారులకు వివిధ రకాల ధృవీకరణ పత్రాలను పంపిణీ చేస్తామన్నారు.

మాలమహానాడు జిల్లా ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసులు

ప్రొద్దుటూరు : ఏపీ రాష్ట్ర మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు జూకాటి విజయశేఖర్ ఆధ్వర్యంలో జిల్లా ఉపాధ్యక్షుడుగా బొల్లవరానికి చెందిన పందిటి శ్రీనివాసులును గురువారం నియమించారు. ఈ సందర్భంగా ఆయన జూకాటి విజయశేఖర్‌తోపాటు జిల్లా అధ్యక్షుడు జేష్టాది భాస్కర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నోట్ పుస్తకాలు పంపిణీ

ప్రొద్దుటూరు : ఆంధ్రప్రదేశ్ మదర్ థెరిస్సా దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో జిమ్ ఇకో సర్వేసెస్ ఎల్ఎల్‌పీ వారి సహకారంతో గురువారం దివ్యాంగ విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పలకలు, పెన్నులు, చాపలు పంపిణీ చేశారు. వికాస్ విహారం స్కూల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ లక్ష్మీపావని, సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు షాకీర్ హుసేన్, హెడ్మాస్టర్ ఝాన్సీరాణి పాల్గొన్నారు.

పంటల బీమా మంజూరు

కలసపాడు : కలసపాడు మండలానికి 2021–22 డాక్టర్ వైఎస్సార్ పంటల బీమా కింద 1719 ఎకరాలకు రూ.1.71 కోట్లు మంజూరైనట్లు వ్యవసాయాధికారి జాకీర్‌షరీఫ్ గురువారం తెలిపారు. మండలంలో సాగుచేసిన పత్తి, కంది, ఉల్లి, వరి, బత్తాయి పంటలకు బీమా మంజూరైనట్లు ఆయన తెలిపారు.

పుస్తకాల పంపిణీ

మైదుకూరు : పట్టణంలోని వెస్ట్ ప్రాథమిక పాఠశాలలో గురువారం వైఎస్సార్‌సీపీ నాయకుడు, 15వ వార్డు ఇన్‌చార్జి కరిడి సన్న శ్రీనురావు నోట్ పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న సుమారు 40 మంది విద్యార్థులకు పార్టీ తరఫున వీటిని అందించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ ఎం.రామారెడ్డి పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

చాపాడు: సీబీఐటీ కాలేజీ ఎదుట జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని చియ్యపాడుకు చెందిన బోగిరెడ్డి బాలకృష్ణారెడ్డికి గాయాలయ్యాయి. ప్రొద్దుటూరు నుంచి చియ్యపాడుకు స్కార్పియో వాహనంలో వస్తుండగా ప్రమాదవశాత్తు అదుపు తప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లింది. గాయపడిన బాలకృష్ణారెడ్డిని చియ్యపాడు మాజీ ఎంపీటీసీ మహేష్ యాదవ్ సహకారంతో ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

జగనన్న సురక్షతో ప్రజలకు ఎంతో లబ్ధి


బి.కోడూరు : లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్సీ గోవిందరెడ్డి



ప్రొద్దుటూరు: సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద రెడ్డి


పోరుమామిళ్ల : సర్టిఫికెట్ అందిస్తున్న నాగార్జునరెడ్డి


బద్వేలు అర్బన్ : ధ్రువీకరణపత్రాలు అందజేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ వై.గోపాలస్వామి

బి.కోడూరు : జగనన్న సురక్షతో ప్రజలకు ఎంతో లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఐత్రంపేట సచివాలయంలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు మేలు చేకూరే విధంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. పరిష్కారం కాని సమస్యలను కూడా జగనన్న సురక్ష కార్యక్రమంలో పరిష్కారమవుతున్నాయన్నారు. సచివాలయం పరిధిలో 140 మంది దరఖాస్తు చేసుకోగా 128 మందికి అప్పటికప్పుడే సర్టిఫికెట్లను అందజేశారు. వీటిని ఎమ్మెల్సీ చేతుల మీదుగా లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దావీదు, ఎంపీపీ కోడూరుచెన్నమ్మ, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ రామకృష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షులు మాధవరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ విజయకుమారి, సచివాలయ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, నాయకులు పిచ్చిరెడ్డి, రామలక్ష్మిరెడ్డి, సుబ్బారెడ్డి, రామ్, భాస్కర్‌రెడ్డి, రాజా, లక్ష్మీనరసారెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ రమణయ్య పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు సంక్షేమ పథకాలే అండ దండ

పోరుమామిళ్ల : రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అండగా ఉంటున్నాయని, అవే వారిని ఆదుకుంటున్నాయని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. గురువారం పోరుమామిళ్ల 2వ సచివాలయంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు ప్రయోజనం చేకూర్చేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, మండల ఉపాధ్యక్షుడు సియం బాష, సచివాలయాల మండల కన్వీనర్ రమణారెడ్డి, ఉపసర్పంచ్ రాళ్లపల్లె రవి, కో ఆప్షన్ మెంబర్ అల్లా, స్పెషల్ ఆఫీసర్ చంద్రశేఖర్, ఎంపీడీఓ చంద్రమౌళీశ్వర్, మండల అధికారులు పాల్గొన్నారు.

ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు

బద్వేలు అర్బన్ : జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయని మున్సిపల్ వైస్ చైర్మన్ వై.గోపాలస్వామి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని కోటవీధి సచివాలయం ఆవరణలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అర్హత ఉండి ప్రభుత్వ పథకం అందని వారికి సైతం లబ్ధి చేకూర్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన అతిపెద్ద కార్యక్రమం జగనన్న సురక్ష అని తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు ధృవీకరణపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ కన్వీనర్ యద్దారెడ్డి, వార్డు ఇన్‌చార్జి బిజ్జంరమణ, మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి, గృహసారధులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నాయకుల చుట్టూ తిరిగే రోజులు పోయాయి

కాశినాయన : ప్రజలు చేతులు కట్టుకుని నాయకుల చుట్టూ తిరిగే రోజులు పోయాయని, ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందుతున్నాయని జెడ్పీటీసీ సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ విశ్వనాథరెడ్డిలు పేర్కొన్నారు. మండలంలోని కొండ్రాజుపల్లె గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి అర్హులై ఉండి పథకాలు రాని వారిని గుర్తించడం, అర్హులైన వారికి జగనన్న సురక్ష పథకం ద్వారా 11 రకాల సర్టిఫికెట్లను అందజేస్తున్నారని అన్నారు. అనంతరం లబ్ధిదారులకు ఉచితంగా సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మైథిలి, తహసీల్దారు రామచంద్రుడు, ఈఓపీఆర్‌డీ ముజఫర్‌రహీమ్, మండల ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్యఆచారి, సర్పంచ్ శారదాదేవి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చక్కటి అవకాశం

అట్లూరు : సమస్యల తక్షణ పరిష్కారానికి జగనన్న సురక్ష పథకం చక్కటి అవకాశమని మండల సచివాలయాల కన్వీనరు మణ్యం మల్లికార్జునరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు మణ్యం వెంకటరెడ్డి, తహసీల్దారు శ్రీవాణి పేర్కొన్నారు. మండల పరిధిలోని కమలకూరు సచివాలయ ఆవరణలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ సుజాతమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజరు విజయకుమారి, ఎంఈఓ విలియం రాజు, ఐకేపి ఏపీఎం సురేష్, వ్యవసాయ అధికారి రామకృష్ణయ్య, ఈఓపీఆర్డీ శివప్రసాద్, ఏఈలు విజయ్‌కుమార్, సత్యభాబు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు శ్రీరాములు, మాజీ సర్పంచు సుబ్రమణ్యం శాస్త్రి, మండల నాయకుడు మణ్యం గంగిరెడ్డి, సోదినపల్లి చెంచునాగిరెడ్డి, సుబ్బారెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

గోపవరం : జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అందించే ప్రభుత్వ సేవల గురించి ప్రజలకు వివరించాలని మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ పేర్కొన్నారు. టీ.సండ్రపల్లె సచివాలయం పరిధిలో జరుగుతున్న జగనన్న సురక్ష ఇంటింటి సర్వేపై గురువారం అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ పరిధిలో ఉన్న ప్రతి ఇంటిని సందర్శించి వారి సమస్యలను తెలుసుకోవడంతోపాటు అర్హత ఉండి సంక్షేమ పథకాలు రాని వివరాలను సేకరించాలన్నారు. అలాగే ఉచితంగా ప్రభుత్వం అందించే 11 రకాల ధృవపత్రాలు ఆ కుటుంబానికి అవసరమైన వాటిని గుర్తించి సిద్ధం చేయాలన్నారు. ఈ నెల 11వ తేదీన సచివాలయం వద్ద జగనన్న సురక్ష క్యాంపును నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆ లోపు ఇంటింటి సర్వే పూర్తి చేయడంతో పాటు ధృవపత్రాలు అవసరమైన లబ్ధిదారులకు టోకెన్ జారీ చేయాలన్నారు. అనంతరం అన్నిశాఖల అధికారులతో కలిసి స్పందన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వారంలో రెండు సార్లు సచివాలయాల్లోనే స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హరినారాయణ, ఈఓపీఆర్‌డీ హసీనా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న సురక్షలో ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

బ్రహ్మంగారిమఠం : అర్హత కల్గిన ప్రతి నిరుపేదలకు లబ్ధి చేకూరాలన్నదే ముఖ్యమంత్రి ధ్యేయమని ఎమ్మెల్యే ఎస్ రఘురామిరెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని గొడ్లవీడు గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారులకు 45 సర్టిఫికెట్లను ఆయన అందజేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

దువ్వూరు : జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి ఓబులేసు పేర్కొన్నారు. మండల పరిధిలోని అన్నపుశాస్త్రులపల్లె సచివాలయంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మండల ప్రత్యేక అధికారి ఓబులేసు మాట్లాడుతూ దరఖాస్తుదారులు ఎంపిక చేసుకున్న సర్టిఫికెట్లను అధికారులు రెండు మూడు గంటల్లోనే ప్రజలకు అందిస్తారని తెలిపారు. అనంతరం 90 మంది దరఖాస్తుదారులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జగదీశ్వర రెడ్డి, సర్పంచ్ సి.సుబ్బారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేదల కోసమే ప్రభుత్వం పనిచేస్తోంది

ప్రొద్దుటూరు : పేదల సంక్షేమం కోసమే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గోపవరం గ్రామ సచివాలయం–2లో గురువారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో సంక్షేమ పథకాలతోపాటు ఇతర అంశాలకు సంబంధించి జరిగిన తప్పొప్పులను సరిదిద్దేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం వేదిక అయిందన్నారు. ప్రజలు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నియోజకవర్గంలో సంక్షేమ పథకాల ద్వారా వందల కోట్ల రూపాయలు మంజూరైందని తెలిపారు. పేదలందరికి జగనన్న ఇళ్లు మంజూరు చేసి నిర్మిస్తున్నామని చెప్పారు. ఇందు కోసం ప్రభుత్వం రూ.1000 కోట్లు కేటాయించిందన్నారు.

తండ్రిని మించిన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ప్రశంసించారు. అనంతరం దరఖాస్తుదారులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్, జెడ్పీ వైస్ చైర్మన్ జేష్టాది శారద, సర్పంచ్ గద్దా మోషా, ఉప సర్పంచ్ బీరం రాఘవేంద్రారెడ్డి, ఎంపీటీసీ వసుంధర, వైస్ ఎంపీపీ ఆసం దస్తగిరి రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు ఖాదర్ బాషా, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం.. జగనన్న సురక్ష లక్ష్యం

చాపాడు : జగనన్న సురక్ష గ్రామ సభల ద్వారా ప్రజల సమస్యలు సత్వరమే పరిష్కారవుతాయని గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ అన్నవరం రామోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని అయ్యవారిపల్లె గ్రామ సచివాలయం వద్ద గురువారం జగనన్న సురక్ష గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన గ్రామ సచివాలయాల కన్వీనర్ మాట్లాడుతూ ఇప్పటికే ప్రతి ఇంటికి అనేక రకాలైన ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఇదే క్రమంలో ఏళ్ల తరబడి ధృవీకరణ పత్రాల కోసం ఎదురుచూసే వారికి జగనన్న సురక్ష మంచి అవకాశమన్నారు. అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. అనంతరం గ్రామంలోని లబ్ధిదారులకు వివిధ రకాల ధృవీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాధాకృష్ణవేణి, ఎంపీటీసీ రమాదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మీరెడ్డి, జయసుబ్బారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు వేణు, సుధ, గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమాన్ని వివరిస్తూ .. సమస్యలు వింటూ


లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

కలసపాడు : వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలనలో చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ.. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ ఎమ్మెల్యే డాక్టర్ సుధ పర్యటన సాగింది. మండలంలోని ఎగువ తంబళ్ళపల్లెలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారం చేపట్టిన నాటి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిత్యం ప్రజల కోసం పని చేస్తున్నారని అన్నారు. పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు పథకాలు అందిస్తూ వారిని ఆర్థికంగా ఆదుకుంటున్నారని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వానికి ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో తేడాను ప్రజలు గమనించాలన్నారు. సంక్షేమ పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో అండగా నిలవాలని కోరారు. గ్రామంలో వీధిలైట్లు, డ్రైనేజీ, పక్కాగృహాలు, తాగునీటి కుళాయి కనెక్షన్లు తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా.. వాటిని పరిష్కరించాలని ఆమె అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అంకనగురివిరెడ్డి, సూదారామకృష్ణారెడ్డి, సుదర్శన్, చిత్తారాజశేఖర్‌రెడ్డి, నారాయణరెడ్డి, అంకిరెడ్డి, సింగరయ్య, సర్పంచ్ సంజయ్‌రాజు, వెంకటరెడ్డి, పులివీరారెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

సర్వీస్ రూల్స్ విడుదల చేయాలి

ప్రొద్దుటూరు : రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీసు రూల్స్ వెంటనే విడుదల చేయాలని ఏపీఎస్‌టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సందిల్ల సుబ్బరాజు యాదవ్ డిమాండ్ చేశారు. స్థానిక ఎస్టీఎఫ్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్, కార్పొరేషన్, గ్రేటర్ కార్పొరేషన్ ఉద్యోగులకు సర్వీసు రూల్స్ విడుదల చేసే అధికారం ప్రభుత్వానిదేనని తెలిపారు. మున్సిపల్ పాఠశాలలలో పెరిగిన విద్యార్థులకు అనుగుణంగా ఉపాధ్యాయుల సంఖ్య కూడా పెరుగుతుందన్నారు. మున్సిపల్ సర్వీసు రూల్స్ ద్వారా మున్సిపల్ పాఠశాలల అప్ గ్రేడేషన్, ప్లస్ 2 పాఠశాలల ఆవిర్భావం, కొత్త పోస్టుల మంజూరు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీఎఫ్ పట్టణ గౌరవాధ్యక్షుడు హరి రామకృష్ణ, పట్టణ అధ్యక్షుడు వినోద్ కుమార్, నాయకులు లక్ష్మీ చౌడయ్య, నాగేంద్ర, భాస్కర్, మధుసూదన్‌రెడ్డి, కిరణ్ కుమార్‌రెడ్డి, రవిశంకర్, పెంచలయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు జగ్జీవన్‌రామ్


జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దళిత, ప్రజా సంఘాల నాయకులు

బద్వేలు అర్బన్ : బాబు జగ్జీవన్‌రామ్ నేటితరానికి ఆదర్శప్రాయుడు అని పూలేఅంబేడ్కర్ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి ఎం.పిచ్చయ్య, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ నారాయణలు పేర్కొన్నారు. జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం స్థానిక సిద్దవటం రోడ్డులోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి దళిత ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తొలి దళిత ఉప ప్రధానిగా జగ్జీవన్‌రామ్ చేసిన సేవలు మరువలేనివన్నారు. నిరుపేద దళిత కుటుంబంలో జన్మించిన ఆయన భారత ఉప ప్రధానిగా ఎదగడంలో ఎంతో కృషి ఉందన్నారు. కార్యక్రమంలో సీనియర్ దళిత నాయకులు కేశవయ్య, జకరయ్య, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకులు జీ.ప్రతాప్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఓబయ్య, డీబీఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నయ్య, దళిత నాయకులు మీసాలరవి, బాలయ్య, సుధాకర్, నారాయణ పాల్గొన్నారు.

ఘనంగా శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతి


శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

పోరుమామిళ్ల : భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతిని గురువారం పోరుమామిళ్లలో బీజేపీ బద్వేలు ఇన్‌చార్జి ఉట్టి శ్రీనివాసులు, మండల అధ్యక్షులు పల్లెంశెట్టి పండరి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ దేశానికి ఒక రాజ్యాంగం, కాశ్మీర్‌కు మరొక రాజ్యాంగం ఉండటాన్ని వ్యతిరేకిస్తూ, శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ 70 ఏండ్ల కిందటే పోరాటం చేశారన్నారు. దేశం కోసం, ధర్మం కోసం పోరాటం చేసిన శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ 1953 జూన్ 6న జైల్లోనే మరణించారన్నారు. ఆయన నెలకొల్పిన జనసంఘ్ ఈనాడు భారతీయ జనతాపార్టీగా అవతరించిందన్నారు. శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు రమణాచారి మండల ప్రధాన కార్యదర్శి వంకదారి జయరామ్, చెన్నకేశవులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ర్యాలీ

పోరుమామిళ్ల : ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ప్రభుత్వమే ఉచితంగా అందించాలని గురువారం ఎస్ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి మండల రెవిన్యూ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. ఎస్ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి వీరపోగు రవి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్‌ఐ నాయకులు రాహుల్, సుమంత్, సందీప్, ప్రవీణ్, చందు పాల్గొన్నారు.

సర్వేలో రెండు కుష్టు కేసులు గుర్తింపు

ప్రొద్దుటూరు క్రైం : ఇంటింటా లెప్రసీ సర్వేలో భాగంగా రెండు కుష్టు కేసులను గుర్తించారు. వైఎంఆర్‌కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలోని డ్రైవర్ కొట్టాలలో గురువారం 15 మంది అనుమానితులను డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ శివశంకరయ్య, డాక్టర్ సీ సునీల్‌కుమార్ పర్యవేక్షణలో పరీక్షించగా ఈ రెండు కేసులు బయటపడ్డాయి. వీరి పేర్లను నమోదు చేసుకొని ఎండీటీ మందులు ఇచ్చినట్లు మెడికల్ ఆఫీసర్ సునీల్‌కుమార్ తెలిపారు. తప్పకుండా మందులను వాడాలని సూచించారు. కార్యక్రమంలో సీఓ ఎంపీ సుబ్బా రెడ్డి, ఎఎన్ఎంలు రమాదేవి, సీతామహాలక్ష్మి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కామనూరు పీహెచ్‌సీ పరిధిలో ర్యాలీ

మండలంలోని కామనూరు పీహెచ్‌సీ పరిధిలో ఉన్న చౌడూరు గ్రామంలో డెంగీ నివారణ మాసోత్సవం సందర్భంగా గురువారం ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ హనీఫ్‌బాబా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ వరప్రసాద్, ఎఫ్‌సీసీ పర్యవేక్షకుడు చంద్రశేఖర్, సీహెచ్ఓ నాగలత, ఆరోగ్య కార్యకర్తలు, పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు కాలువపల్లెలో జగనన్న సురక్ష కార్యక్రమం

గోపవరం : మండలంలోని కాలువపల్లె సచివాలయంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం ఉంటుందని ఎంపీడీఓ హరినారాయణ తెలిపారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నామన్నారు. 250 ధృవపత్రాలను ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలు పాల్గొనాలన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య



కాశినాయన : మండలంలోని వరికుంట్ల నుంచి జ్యోతిక్షేత్రానికి వెళ్లే దారిలో ఎస్సీకాలనీ సమీపంలో గుర్తు తెలియని 65 ఏళ్ల వ్యక్తి గురువారం పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కాశినాయన ఎస్‌ఐ హరిప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోరుమామిళ్ల ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ వ్యక్తి ఫొటోను వివిధ మాధ్యమాల్లో పంపించామని, ఎవరైనా గుర్తిస్తే తమకు తెలియజేయాలని కోరారు.

ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చాం


గొడ్లవీడులో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

బ్రహ్మంగారిమఠం : వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాలుగు ఏళ్లలో ప్రతి నిరుపేద కుటుంబానికి లబ్ధి చేకూరిందని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని గొడ్లవీడు, గొడ్లవీడు ఎస్సీ కాలనీలో గడప గడపకు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందించిన పథకాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇచ్చిన హామీని నెరవేర్చామన్నారు. ప్రతి నిరుపేదకు ప్రభుత్వ సంక్షేమం అందించామన్నారు. ప్రజలు తిరిగి ముఖ్యమంత్రిగా వైఎస్ జగనన్నే కావాలని కోరుకుంటున్నారని పేర్కొన్నారు. ఎస్సీ కాలనీ వాసులు ఆర్‌ఓ ప్లాంట్, విద్యుత్ తీగల ఏర్పాటు, డ్రైనేజీ, సీసీ రోడ్లు కావాలని కోరగా ఎమ్మెల్యే స్పందిస్తూ ఆర్‌ఓ ప్లాంట్, విద్యుత్ సమస్యను తక్షణం చేయిస్తానని తెలిపారు.

20 యానాది కుటుంబాలకు ఎలాంటి ఆధారం లేదని ఎమ్మెల్యేకు ఫిర్యాదు

గొడ్లవీడు గ్రామంలో నివసిస్తున్న 20 యానాది కుటుంబాలకు ఆధార్, రేషన్‌కార్డు, వసతి గృహాలు లేవని ఎమ్మెల్యే దృష్టికి మాజీ సర్పంచ్ నాగేశ్వర్‌రెడ్డి తీసుకువచ్చారు. దూర ప్రాంతాలకు వెళ్లి పనులు చేసుకుంటుండటంతో వారికి ఎలాంటి ప్రభుత్వ గుర్తింపు లేవని తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే తక్షణం నిరుపేదలకు ఆధార్, రేషన్‌కార్డులు అందించాలని అధికారులను ఆదేశించారు. యానాదులకు ఇంటి స్థలం కావలంటే నేను 1.50 ఎకరాలు ఉచితంగా ఇస్తానని నాగేశ్వర్‌రెడ్డి ఎమ్మెల్యే ముందు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు సుబ్బిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మేకల రత్నకుమార్‌యాదవ్, రాజానాయుడు, సర్పంచ్ చెన్నకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సిద్దారెడ్డి, రమేష్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, రామసుబ్బారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే

మండలంలోని గొడ్లవీడు పంచాయతీ పీసీ పల్లెలో ఆర్‌అండ్‌బీ నిధులు రూ.40లక్షలతో గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్డును గురువారం ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. గత తెలుగుదేశం ప్రభుత్వం స్థానిక గ్రామ ప్రజలు వర్షం వస్తే నడవాలంటే ఇబ్బందులు పడుతున్నామని ఎన్ని సార్లు నాయకులకు, అధికారులకు ఫిర్యాదులు చేసినా స్పందించలేదన్నారు. సమస్యను ప్రజాప్రతినిధులు నా దృష్టికి తేవడంతో అధికారులపై ఒత్తిడి తెచ్చి రోడ్డును నిర్మించామన్నారు. ఆర్‌అండ్‌బీ ప్రొద్దుటూరు డివిజన్ కంబగిరి, ఏఈఈ సునీల్‌కుమార్, వైస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖరీఫ్ సీజన్ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ నాగరాజ

గోపవరం : ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేయబోయే వివిధ రకాల పంటలకు సంబంధించి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ పేర్కొన్నారు. గురువారం ఏడీఏ కార్యాలయంలో బద్వేలు డివిజన్ పరిధిలోని సిద్దవటం, అట్లూరు, బద్వేలు, గోపవరం మండలాలకు చెందిన వ్యవసాయాధికారులు, వ్యవసాయ సహాయకులకు ఒక్క రోజు శిక్షణా కార్యక్రమంతో పాటు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు రైతులకు సబ్సిడీ ద్వారా ఇచ్చిన విత్తనాలు, ఎరువులు, యాంత్రీకరణ పథకం ద్వారా అందించిన పనిముట్లపై సమీక్షించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ–క్రాప్ బుకింగ్ ఈ నెల 15 నుండి ప్రారంభమవుతుందని, ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. కౌలు రైతులకు కౌలు కార్డులు ఇప్పించడంతోపాటు వారికి రైతుభరోసా వర్తించేందుకు దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ఉద్యాన పంటలు సాగు చేసే రైతులకు అవసరమైన డ్రిప్‌లు, స్ప్రింకర్లు క్షేత్రస్థాయిలో అమలుపరిచి సకాలంలో వారికి అందజేయాలన్నారు. అలాగే పీఎం కిసాన్‌కు సంబంధించి ఈకేవైసీ నమోదు చేయించుకునేందుకు ఈ నెల చివరి వరకు గడువు ఉందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు చంద్రమోహన్‌రెడ్డి, అరవిందనాయక్, రామకృష్ణ, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ జూనోసిస్ డే

ప్రొద్దుటూరు : స్థానిక శ్రీవెంకటేశ్వర ప్రభుత్వ పశువైద్య కళాశాలలో ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వైకుంఠరావు జూనోసిస్ డేను వివరించడంతోపాటు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటి రేబిస్ టీకాలు వేశారు. పెంపుడు జంతువుల సంరక్షణ, డీవార్మింగ్, టీకాలు, పోషణ గురించి పశు పోషకులకు వివరించారు. ఈ సందర్భంగా 132 కుక్కలకు టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్య చికిత్స సముదాయం అధిపతి డాక్టర్ కలక రాంబాబు, డాక్టర్లు రేవతి, శివసుదర్శన్, విద్యాసాగర్, జ్యోతి, భార్గవి, దేవరత్నం, సుమిరాన్, గుణరంజన్, శివజ్యోతి, ఫైనల్ ఇయర్ విద్యార్థులు పాల్గొన్నారు.

కుక్కలకు యాంటీ రాబీస్ టీకాలు

కలసపాడు : స్థానిక పశువైద్యశాలలో గురువారం ప్రపంచ జూనోసిస్‌డే సందర్భంగా కుక్కలకు యాంటీ రాబీస్ టీకాలు వేయడం జరిగిందని పశువైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ కుక్కల పెంపకందారులు అందరూ కుక్కలకు టీకాలు వేయించాలని తెలిపారు.